# అమ్మాయీ- అశోకమూ

## విజయలక్ష్మి



మొన్న నీ మధ్య ఎవరో స్నేహితు లింటి కెళ్ళాను. వాళ్ళ డ్రాయింగు రూములో ఓ పాతకాలపు చిత్రం కనిపించింది. ఓ సర్వాభరణభూషిత యైన సుందరాంగి అశోక వృక్షాన్ని కాలితో తాకుతున్న (తిమ్మనగారు 'తొలగండ్రోచె' నన్నట్లు) చిత్రం. అది చూచాక ఆ అమ్మాయి స్వభావం, నా స్వభావంకన్నా భిన్నమైంది కాదేమో ననిపించింది. ఆ వైనం మీకు చెప్తాను.

మందాకినీ, నేనూ ఫోర్తుఫారంనుంచీ బి. యస్సీ. దాకా కలిసి చదివాము. ఒకే స్కూల్లో. ఆ తర్వాత ఒకే కాలేజీలో, ఒకే సబ్జక్టులో డిగ్రీలు తీసుకున్నాం. ఏడేండ్లు క్రమంగా ఎదుగుతూవచ్చిన మా స్నేహం స్థిరపడిపోవడమే కాక, చెట్టులాగా ఇంకా యింకా ఎదుగుతూనే వుంది. నేను బి.యస్సీ. తర్వాత మా వూరువిడిచి ఢిల్లీకి వెళ్ళి ఓ డాక్టరేటు తెచ్చుకుందికి ఆరేళ్ళు పట్టింది. బి యస్సీ తో చదువు మానేసిన మందాకిని ఆ ఆరేళ్ళలో యిద్దరి బిడ్డల తల్లి అయింది. ప్రతిసారి సెలవలకు ఇంటికి వెళ్ళినపుడు మందాకిని యింట్లో ఒక వారమైనా గడపందే తిరిగి చదువుకు వెళ్ళేదాన్ని కాదు. జీవితమార్గాలు విభిన్నాలయినా, మా స్నేహం మారలేదు. క్రొత్తలో ఓసారి జాబులో వ్రాసాను, ''నీ యిల్లు, భర్త, సంసారం యీ బాధ్యతల్లో నన్ను మర్చిపోవడానికి ఎన్నిరోజులు కావాలి నీకు?" అని. దానికి బదులు, ''నీది రాతిగుండె కనుక అట్లా వ్రాశావు. నీ చదువు, బాధ్యత, యూనివర్సిటీలో అంతమంది స్నేహితులు; వాళ్ళలో ఎవరైనా నీకు, నాకన్నా దగ్గరవడానికి ఎన్నిరోజులు కావాలి? అని నేను వ్రాయలేకపోయాను'' అని వ్రాసింది. మేమిద్దరం మా స్నేహాన్ని ఖరీదైన రత్నాల హారంలాగ అతి భద్రంగా కాపాడుకుంటూ వచ్చాం. నిలుస్తే నిలుస్తుంది, లేకపోతే లేదు అనే నిర్లక్ష్యం మా యిద్దరికీలేదు. ఇద్దరం ఒకర్ని ఒకరు నొప్పించకూడదనే శ్రద్ధగా వుండేవాళ్ళం. మీరడగవచ్చు. ''స్నేహం కూడ అంత 'స్ట్రెయిన్'అయితే ఎట్లా" అని. అదేమో, మాకట్లా అనిపించలేదు. మందాకిని భర్త మోహనరావు మంచి కలుపుగోరు మనిషి. మొదట్లో ఆయనతో మాట్లాడాలంటే మహా బెరుగ్గా వుండేది నాకు. మందాకిని మాత్రం యిది కనిపెట్టినట్లుగా, భర్త ఎదుట నన్ను వూరికేనే ఎగతాళి చెయ్యడం, నేను మాటరాక నిలబడిపోవడం, ఆమె భర్త నన్ను సమర్థిస్తూ భార్యకు బదులు చెప్పడం - వీటితో నా బెరుకు వదిలిపోయింది. ఓ రోజు వాళ్ళింట్లో రాత్రి భోజనాలు చేస్తున్నాం. మోహనరావు నన్ను చూచి,

"నిరుడు ఎంతో సరదాగా వుండేవారు; యీ ఏడాది ఏమిటీ దిగులు దిగులుగా కన్పడుతున్నారు?''అన్నాడు.

ఆ ఏడాది నా Ph.D.చదువులో రెండో సంవత్సరం. డాక్టరేటు చదువు నిజంగా దయ్యంలాంటిదె. దాన్ని ఏరి కోరి తెచ్చి నెత్తిన పెట్టుకున్నాక, మళ్లీ దాన్ని దించి క్రింద పెట్టి వూపిరి తీసుకోడానికి ఎన్ని దిగులు రాత్రులు, ఎన్ని చాకిరీ పవళ్ళు గడపాలో అనుభవిస్తేనే తెలియాలి.

ఆయనకు నేను బదులు చెప్పేలోపలే, ''నిరుడు మనకి చెప్పింది చూడండీ, వాళ్ల యూనివర్సిటీలో ఎవరో యిద్దరు ప్రొఫె

సర్లకు యింకా పెళ్ళి కాలేదని, మొన్న వేసంగిలో వాళ్ళ పెళ్ళిళ్ళుకూడ అయిపోయాయట" అంది మందాకిని విరగడి నవ్వుతూ.

సిగ్గుతో చచ్చిపోయాను నేను.

మోహనరావు ''రోజూ నా ప్రాణాలు తీస్తుంది. యిప్పుడు మీరు దొరికారు. మీ పని పట్టించింది. ఆ మధ్య ఎపుడో అన్నానండి. యీ ఏడు ఒక మళయాళీ అమ్మాయి వచ్చింది యం.యస్సి.కి. మహా అందమైంది అని. మీరూ నమ్మరు. చూస్తే నిజంగా రవివర్మ బొమ్మలా గుంటుంది. ఆ మాట అంటే మీ స్నేహితురాలు అన్నదికదా ''ఆ రేళ్ళ క్రిందటివరకు, మీ యూనివర్సిటీలో అందమైన అమ్మాయిలుండేవారు కాదా'' అని అంటూ నాకు సానుభూతి చూపాడాయన.

మోహనరావు యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్టుమెంటులో రీడరు. నా ఎం.యస్సి. అయిన మరుస టేడాది కాబోలు ఢిల్లీలో జరిగింది సైన్సు కాంగ్రెసు. పసిబిడ్డను వాళ్ళ అమ్మ దగ్గర వదిలి భర్తతోపాటు ఢిల్లీకి వచ్చింది మందాకిని. మోహనరావు కాంగ్రెస్ డెలిగేట్స్ దిగిన చోటే దిగారు. మందాకిని మాత్రం నా రూముకు వచ్చి వుంది మూడు రోజులూ. ముప్ఫై మంది చుట్టాల సందడి మందాకిని ఒక్కెత్తి దీ. హాస్టల్లో వున్న నా ప్రాణానికి మందాకిని రాక స్వాతివాన అయింది. ఒకటి రెండుసార్లు సాయంత్రం మేం ముగ్గురం కలిసి వూరు చూడ్డాని కెళ్లాం. మందాకిని భర్తతో కలసి బైట కెళ్లేప్పుడల్లా ఆయన వేసుకున్న బట్టల కనుగుణంగానే తానూ దుస్తులు ధరించేది. ఓ రోజు ఆయన తెల్లటి షర్టు, నీలిరంగు పేంటూ వేసుకున్నాడు. మందాకిని, లక్నో కుట్టుపని చేసిన తెల్లటి జార్జెట్ చీర, నీలిరంగు బ్లౌజూ వేసుకుంది - మరునాడు ఆయన తెల్లపాంటూ, రంగురంగు చారల షర్టూ వేసుకున్నాడు. గళ్లగళ్ల కంచి చీర, తెల్ల బ్లవుజూ వేసుకుంది మందాకిని. నాకు మహా వింతగా తోచింది. మందాకిని వాళ్ళింట్లో వున్న నాలుగు గదుల్లోనూ, భార్యాభర్త లిద్దరూ కలిసి తీయించుకున్న ఫోటో లుండేవి.

''ఏమిటి, గది గదిలోనూ ఫొటోలు?'' అని అడిగానోసారి.

''ఊఁ పిచ్చి పట్టినట్లు చీటికి మాటికి ఫోటోలు తీసుకోడం, వాటిని గోడల కెక్కించడం, ఇంకో పని లేదు. మీ అన్నయ్యకి''అని విసుక్కుంది మందాకిని. ఆ విసుక్కోవడంలో విసుగు నటించడమే గాని నిజమైన విసుగు కనపడలేదు నాకు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, వాళ్ళిద్దరూ అన్యోన్యంగా వుండడమే కాదు, ఆ సంగతి అందరికీ తెలియాలి అనే తాపత్రయం కూడ వాళ్ళిద్దరిలోనూ తోచేది నాకు. ఆఫీసర్ల భార్యలు వాళ్ల భర్తల హోదాల గురించి సూటిగానో, అన్యాపదేశంగానో మాట్లాడకుండా వుండలేనట్లు! ''అటువంటి తాపత్రయం గల దంపతులు నిజంగా అన్యోన్యంగా లేరని అర్థం''అని మీలో మానసిక శాస్త్రం చదువుకున్నవా ళ్ళెవరైనా అనవచ్చు. కాని నాకు మాత్రం అలా అనిపించలేదు. చిలకాగోరింకల గురించి చదివానే కాని తెలీదు. ''నెత్తిన పెట్టుకు చూసుకోడం, పువ్వుల్లోపెట్టి పూజించడం" యివి మాత్రం వాళ్ల సంసారంలోనే చూసాను నేను.

ఏణ్ణర్థం అయిందేమో, ఓనాడు అమ్మ జాబు వచ్చింది. "మందాకిని భర్త మోహనరావు మొన్న శనివారం అకస్మాత్తుగా కరోనరీ థ్రాంబోసిస్‌తో పోయాడు"అని వ్రాసింది. స్థంబించి పోయాను. నాకు థీసిస్ సబ్‌మిట్ చేసే తరుణం. వెంటనే తెరపి చేసికొని ఢిల్లీ నుంచి విశాఖపట్టణం వెళ్లలేకపోయాను. అన్నీ తెముల్చుకుని యింటికి ప్రయాణమయ్యేసరికి రెండు నెల్లయింది. యింటికి వెళ్ళి సామానంతా పడేసి విశాఖ వెళ్ళి మందాకినిని చూద్దామనుకున్నాను. యిల్లు చేరానో లేదో జ్వరం పట్టుకుంది. నాలుగో రోజుకు టైఫాయిడ్ క్రింద తేల్చారు. పథ్యం తిన్నానో లేదో, ఢిల్లీ నుంచి యు. పి. యస్సి. వాళ్ళ ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. వెంటనే వెళ్లిపోయాను. ఆ ఉద్యోగానికి నేను సెలక్టు కావడం, వెంటనే చేరవలసి రావడం, తర్వాత మళ్ళీ సెలవలకు యింటికి బయల్దేరడం అంతా ఆరు నెల లయిపోయింది. యింటికి వెళ్ళకుండా నేరుగా విశాఖ కే మందాకినిని చూడటానికి వెళ్ళాను. గేటు తెరుచుకు లోపలికి వెడితే ఆయిల్లు కాదేమోనన్నంత సందేహం వచ్చింది నాకు. తోటలో ఒక మొక్కకూ పువ్వులేదు. లాన్ అంతా మాడిపోయి ఉంది. తోటంటే ప్రాణాలు విడిచే మందాకిని యిల్లేనా అనిపించింది! ఆరు నెలల తర్వాత ఓదార్పుకు వచ్చానే అని మనసు పీడిస్తోంది నాకు. కాని, మందాకిని దుఃఖం చూస్తే ఆరు రోజు లయినా గడిచాయా లేదా, అన్నంత ఉద్ధృతంగా వుంది. పొరపాటునైనా పిల్లలను విసుక్కోని మందాకిని వాళ్ళను చీటికి మాటికి చెయ్యిచేసుకోటం చూసి రిచ్చపోయాను నేను. ఐదేళ్ళ పసివాడు- మందాకిని కొడుకు - వాడికి బిగ్గరగా మాట్లాడ్డం భయం, యింట్లో గంతు లెయ్యడం భయం, ఆకలి అని అడగడం భయం, పక్క యింటి పిల్లలతో ఆడుకోడానికి భయం. తల్లిని చూసి పారిపోవడం, గదిలో మూల పుస్తకం ఒళ్ళో పెట్టు క్కూర్చుని ఎ. బి. సిలు కూడ బలుక్కోడం! నా హృదయం ద్రవించి పోయింది ఆ చిన్నవాణ్ణి చూస్తే ! మందాకిని అత్తగారు నన్ను చాటుకు పిల్చి కళ్ళు ఒత్తుకుంటూ ''మోహనుడు నాకు ఒక్కగాని ఒక్క కొడుకు. నా జీవితపు చరమాధ్యాయంలో వాడు లేనిలోటు నన్ను పిచ్చిదాన్ని చెయ్యడానికి ఎన్నాళ్ళు కావాలి ?

నా కోడలి దుఃఖం ఎంతటిదో అనుభవించినదాన్ని నాకు తెలుసు. నేను యీ రీతిగా కుమిలిపోయి వుంటే నా మోహను డేమైపోయేవాడు? ఆ పిల్లలు, నా కోడుకు పిల్లలు వాళ్ళు-వాళ్ళను చూస్తే గుండె చెరువైనా చేసేది లేక దిగమింగుకుంటున్నాను. అది పసిబిడ్డనైనా తాకటం లేదు. నువ్వు దానికి దగ్గరి నేస్తానివి, అందుకు చెప్తున్నాను''అంది. ఇంటి ఆనవాయతీలాగ అత్త అనుభవించిన దుఃఖమే కోడలనుభవించాల్సి రావడం-విచిత్రం!



ఆమె చెప్పింది నిజం. మందాకినికి దుఃఖాగ్నితో తన్ను తాను దహించుకోడానికి హక్కు వుండవచ్చు కాని, దానితో యింటికే నిప్పు పెట్టడానికి మాత్రం హక్కు లేదు. ఏమి చెయ్యాలో, ఏమి చెప్పాలో పాలుపోలేదు నాకు. పలికితే, పలుకరిస్తే ప్రతిమలాగ కూర్చుని కళ్ళ నీళ్లు కార్చడం తప్ప మందాకిని నా దగ్గర కూడ బావురుమని ఏడవలేదు. ఎక్కువ రోజు లుండలేక నాలుగోనాడు వెళ్ళిపోయాను. ఎక్కడున్నా మందాకిని పిల్లలు, తల్లి వుండి కూడ తల్లి ప్రేమకు కరువాసిన ఆ అభాగ్యులు నా మనసులోనే వుండిపొయ్యారు. ఢిల్లీ వెళ్ళాక రాత్రింబవళ్ళు వాళ్ళదే ఆలోచన నాకు. ఓ నాటి అర్ధరాత్రి ఓ విచిత్రమైన ఆలోచన వచ్చింది నాకు. మందాకిని మనసుకు "మరపు" తేవడం కన్నా "మార్పు" తేవడం తేలికనిపించింది నాకు. "ఏడు జన్మల స్నేహం అక్కరలేదు, శత్రువులగా బ్రతికి నా మూడు జన్మల్లో తిరిగి వస్తాం" అన్న జయ విజయుల ఆరాటంలాగ! నా డాక్టరు ఫ్రెండు లతను సంప్రదించాను. నా ఆలోచన చెప్పి ఆమె సాయ మడిగాను. నవ్వి "దానికేం, అట్లాగే కానీ" మంది.

తర్వాత మళ్ళా ఏడాదికి వెళ్ళాను మందాకిని యింటికి. టెలిగ్రాం చూసుకుని, కొడుకుని తీసికొని స్టేషన్‌కు వచ్చింది. మనిషిలో మార్పు కనపడింది. కొడుకు తల్లి కొంగు లాగుతూ, కామిక్స్ కోసం మారాం చేస్తూ నాతో మాట్లాడనిచ్చాడు కాదు. ఇంటి కెళ్ళగానే అత్తగారి చేతిలోంచి కూతుర్ని తీసుకు ముద్దాడి దించింది. మందాకిని అత్తగారిని "బాగున్నారా" అని పలుకరించాను.

ఆ వృద్ధురాలు "ఆఁ నా బాగు కేమమ్మా, కోడలు మళ్ళా యిట్లా తేరుకుంటుందని, యిల్లు, పిల్లల్ని చూసుకుంటుందని అనుకోలేదు. అదే చాలు, దైవలీల!" అంది.

గదుల్లో ఎక్కడా పాత ఫోటోలు లేవు. అన్నీ పిల్లల ఫోటోలే కనపడ్డాయి. ఉండబట్టలేక, "అన్నయ్య ఫోటో ఒక్కటీ కనపడదేం?" అన్నాను.

మందాకిని జేవురించిన ముఖంతో "ఫరవాలేదు, లేకపోయినా" అంది.

"ఏమిటి మందాకినీ సంగతి?" అన్నాను.

పలుకలేక, దుఃఖాన్ని పట్టలేక వెక్కి వెక్కి ఏడ్చింది మందాకిని.

అనునయిస్తూ "ఎందుకూ, చెప్పవ్" అన్నాను.

నా చేతులు తన చేతుల్లోకి తీసుకుని, "నీకు తెలుసు, నాకు పవిత్రతలో ఎంతో నమ్మకముందని; త్రికరణశుద్ధిగా ప్రేమించిందీ, కొలిచిందీ, ఆరాధించిందీ అతన్నే! కాని-ఆరేళ్ళపాటు నా ఆరాధనను ఒక వంచకునికోసం వెచ్చించానని తెలుసుకున్నపుడు నేనెంత కృంగిపొయ్యాను?"

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" అన్నాను ఏమీ ఎరగనట్లు.

"ఉండు చూపిస్తాను" అని లోపలికి వెళ్ళి ఓ ఆరో, ఏడో కవర్లు తెచ్చి చదవమంది.

"ఎందుకు?" అన్నాను.

"ఎవరో, ఆయనతో కలిసి చదివిన బాపతు కాబోలు, కాలేజీ అడ్రసుకు జాబులు వ్రాసుకునే అలవాటేమో, సంగతి తెలియక యింకా అప్పుడప్పుడు వ్రాస్తూనేవుంది ప్రేమలేఖలు. ఆమె అడ్రసు ఏ జాబులోనూ లేదు. లేకపోతే నేనొక జవాబు వ్రాసి పడేసేదాన్ని. చదివి చూడు తెలుస్తుంది" అంది.

నాకు తెలియనివి కావు ఆ వుత్తరాలు. చదివినట్లు నటించి నిట్టూర్చాను.

మందాకిని అన్నది "నాకు యీర్ష్య, అసూయ అనుకుంటావేమో, అదికాదు, నేను మోసపోయానన్న బాధ. నన్ను పిచ్చిదాన్నిగా చేసి ఆడుకున్న మనిషిని ఆరాధించానే అన్న బాధకాని! ఎంత కక్ష వచ్చిందంటావు సంగతి తెలిసాక. ఆ మనిషికి నా మనసులో చోటు లేదనుకున్నాను. బలవంతంగా చెరుపుకున్నాను. వంచించిన వానికోసం ఏడవడంకన్నా ఆత్మవంచన ఇంకోటి వుందా? హుఁ ఎంత అమాయకంగా నటించేవారు! ఓ రోజు ఏదో మూడ్‌లో నన్ను వూరికే పొగడేస్తుంటే అడిగాను తమాషాకే, "ఇంత ఆసక్తి, ఇంత ఆదరణా ఎప్పుడూ వుంటాయా నేనంటే" నని. ఏమన్నారో తెలుసా? దగ్గరకు తీసుకుని "నిర్మల మందాకినీ వీచికల తూగు రాయంచ చనునె తరంగిణులకు" అన్నారు. పులకించిపోయాను. అవన్నీ తలచుకుంటే నామీద నాకు అసహ్యం కలుగుతుంది యిప్పుడు. నా సుఖానికి, సంతోషానికి, నా పిల్లల సౌఖ్యానికి అతని గురించిన దుఃఖం అడ్డు రాకూడదనుకున్నాను. నువ్వనుకోవచ్చు, నేను కఠినాత్మురాలనని" అంది.

మందాకిని కాదు కఠినాత్మురాలు, నేను! మోహనరావు నా కళ్ళముందు కదిలాడు. బ్రతికున్న మనిషిని చంపగలిగే సాహసులున్నారు లోకంలో. కాని పోయిన మనిషిని హత్య చెయ్యడం మాత్రం నావల్ల జరిగింది. నిష్కృతి వుందా నా పాపానికి? వుందనే అనుకుంటాను. మందాకిని పిల్లలను, చక్కబడిన ఆమె యింటిని చూస్తే! "తన్నినా ఫరవాలేదు, చెట్టు పూస్తే చాలు" అనే స్వభావమే నాది కూడ.